క్లుప్తంగా

నీట్‌లో సత్తా


కుమార్తెకు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

ఓడీ చెరువు: నీట్ పరీక్షా ఫలితాల్లో మండలం లోని నల్లగుట్లపల్లికి చెందిన సత్యనారాయణ నాయక్, లక్ష్మీదేవిబాయి దంపతుల కుమార్తె సౌజన్యబాయి సత్తా చాటింది. బుధవారం ప్రకటించిన ఫలితాల్లో 720 మార్కులకు 397 మార్కులు సాధించింది. ఎస్టీ కేటగిరిలో 4,180 ర్యాంకు పొందింది. డాక్టర్ కావడమే తన లక్ష్యమని విద్యార్థిని తెలిపింది.


జశ్వంత్‌రాజ్

నల్లచెరువు: మండల పరిధిలోని దామవాండ్లపల్లికి చెందిన దేరంగుల జశ్వంత్ రాజ్ నీట్ పరీక్షలో ప్రతిభ కనబరిచాడు. 547 మార్కులు సాధించి సత్తా చాటాడు. ఈ సందర్భంగా జశ్వంత్‌రాజ్ మాట్లాడుతూ న్యూరో సర్జన్ అయ్యి పేదలకు సేవ చేయాలన్నదే తన కోరిక అని తెలిపాడు.

పశు బీమా చేయించండి


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి గుర్నాథరెడ్డి

బత్తలపల్లి: పశు పోషణపై ఆధారపడి జీవిస్తున్న రైతులు పాడి పశువులకు వైఎస్సార్ పశు బీమా చేయించుకోవాలని బత్తలపల్లి పశు వైద్యాధికారి డాక్టర్ గుర్నాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన స్థానిక పశువైద్యశాలలో విలేకర్లతో మాట్లాడారు. రూ. 15 వేల నుంచి 1,20,000 వరకూ పాల ఉత్పత్తి ఆధారంగా బీమా చేయించుకోవచ్చన్నారు. మూడు సంవత్సరాలకు ఒకసారి బీమా చెల్లించాలన్నారు. గొర్రెలు ఉన్నవారు గరిష్ఠంగా 50 గొర్రెలకు సంవత్సరానికి, రెండు సంవత్సరాలకు, మూడు సంవత్సరాలకు విడివిడిగా బీమా చేయించుకోవచ్చన్నారు. వివరాలకు రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించి పశువులు, గొర్రెలు, మేకలకు బీమా చేయించుకోవాలని సూచించారు.

జగనన్న విద్యా కానుక పంపిణీ


విద్యాకానుక కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని బడన్నపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు బడన్నపల్లి కేశవరెడ్డి, సర్పంచ్ నందిని హాజరయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బీకే ముత్యాలప్ప అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడన్నపల్లి పాఠశాలను నాడు నేడు కింద అత్యద్భుతంగా తీర్చిదిద్దారన్నారు. విద్యా కానుక, జగనన్న గోరుముద్ద లాంటి కార్యక్రమాలతో పేద విద్యార్థులను గొప్ప విద్యావంతులుగా తీర్చిదిద్దాలని శ్రమిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరిబాబు, నాగేశ్వరి, గోవిందు, సచివాలయ వెల్ఫేరు అసిస్టెంట్ రేణుక, పాఠశాల సీఎంసీ చైర్మెన్లు, తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో రాజీ వద్దు


రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీలత

ఎన్పీకుంట: శాంతి భద్రతల పరిరక్షణలో రాజీ పడవద్దని డీఎస్పీ ఎం.శ్రీలత పోలీస్‌సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని సమస్యాత్మక గ్రామాలు, స్టేషన్‌లో క్రైంరేట్, పెండింగ్ కేసుల గురించి ఎస్‌ఐ సద్గురుడుతో ఆరా తీశారు. ప్రమాదాల నివారణ, శాంతిభద్రతల విషయంపై పలు సూచనలు చేశారు. కేసులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. మండలంలో అక్రమ మద్యం, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సద్గురుడు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

'ఎంపీపీపై దాడి చేసిన వారిని శిక్షించాలి'

నల్లచెరువు: కాకినాడ జిల్లా రౌతులపూడి మండల ఎంపీపీ, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన విజయలక్ష్మిపై దాడికి పాల్పడిన వారిని శిక్షించాలని జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు కె. రమణారెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రౌతులపూడిలో నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆహ్వానించకపోగా ప్రశ్నించిన ఆమెపై దాడి చేయడం దారుణమన్నారు.

సంక్షేమ పథకాలతో పేదల ఆర్థికాభివృద్ధి

- ఎమ్మెల్యే డాక్టర్ సిద్ధారెడ్డి


సంక్షేమ పథకాలపై లబ్ధిదారులతో ఆరా తీస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్ధారెడ్డి

గాండ్లపెంట: పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్ధారెడ్డి అన్నారు. మండల పరిధిలో కటారుపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని ద్వారనాల, నల్లసానివారిపల్లి, జురుకువారిపల్లి, కటారుపల్లిక్రాస్, గజ్జలప్పగారిపల్లి, సాదులవాండ్లపల్లి, మాలపల్లి, బలిజపల్లి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గడప గడపకూ వెళ్లి సంక్షేమ పథకాలు అందాయా లేదా అంటూ ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తన సుదీర్ఘ పాదయాత్రలో పేదలు పడుతున్న ఇబ్బందులను గుర్తించారన్నారు. అధికారంలోకి రాగానే నవరత్నాల పేరిట సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. మరో వైపు రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు తీసుకుపోతున్నారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా అమలు కాని పథకాలు కేవలం మన రాష్ట్రంలోనే అమలవుతున్నాయన్నారు.తెలుగుదేశం హయాంలో జన్మభూమి కమిటీలంటూ పేద ప్రజల కడుపుకొట్టారని, నేడు కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులైన వారందరికీ పథకాలు ఇంటి వద్దకే చేరుతున్నాయన్నారు. మారుమూల గ్రామాలకు సైతం రోడ్లు వేశామని చెప్పారు. మాలపల్లిలో పలువురు స్థానికులు గ్రామానికి దారి కావాలని ఎమ్మెల్యేను కోరగా, స్థలం చూపాలని వెంటనే దారి సమస్య తీరుస్తానని ఆయన తెలిపారు. పట్టా భూములు ఉన్నందున యజమానులు న్యాయస్థానానికి వెళ్లారని, దీంతో రహదారి సమస్య పరిష్కారం కాలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యాదవేంద్ర, సచివాలయ గ్రామ కన్వీనర్లు క్రిష్ణారెడ్డి, ఉత్తన్న, చలపతి, హరిప్రసాద్‌రెడ్డి, రామక్రిష్ణ, రాకేష్‌రెడ్డి, ఎంపీపీ తాతం జగన్మోహన్, వైస్ ఎంపీపీలు గంగోజమ్మ, భారతి, కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ ఫయాజ్‌అలీ, జేసీఎస్ కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, మాజీ జెడ్పీటీసీ భాస్కరరెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రవీంద్రానాయక్, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు


మాట్లాడుతున్న ఏఓ శ్రీహరినాయక్

తనకల్లు: నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయాధికారి శ్రీహరినాయక్ అన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో మంగళవారం మండలంలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల షాపుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలను విక్రయించాలన్నారు. ప్రభుత్వం అనుమతించిన, ధృవీకరించిన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే అమ్మాలని ఆదేశించారు. ధరల వివరాలను నమోదు చేసి దుకాణాల ముందు ప్రదర్శించాలన్నారు. కొనుగోలు చేసిన రైతులకు ఖచ్చితంగా రసీదులను అందజేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను పాటించకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఏఓ హెచ్చరించారు.

రెడ్డివారిపల్లిలో 'ఫ్యామిలీ ఫిజీషియన్'


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

ఎన్పీకుంట: 'ఫ్యామిలీ ఫిజీషియన్' కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని వైద్యసేవలు పొందాలని మండల వైద్యాధికారి డాక్టర్ ఆనంద్‌వర్ధన్ తెలిపారు. మండల పరిధిలోని ఎస్.రెడ్డివారిపల్లిలో బుధవారం 'ఫ్యామిలీ ఫిజీషియన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇంటి వద్దే వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. అనంతరం 104 వైద్య శిబిరంలో డాక్టర్ ఆనంద్‌వర్ధన్ 60 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు, చిన్నపిల్లలు, బీపీ, షుగర్, థైరాయిడ్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్యకార్యకర్త రమేష్‌రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ భార్గవి, ఏఎన్ఎమ్ రాధాకుమారి, ఆశాకార్యకర్త రాధా తదితరులు పాల్గొన్నారు.

డీపీటీఓ నిరంకుశ వైఖరి వీడాలి


నిరసన తెలుపుతున్న ఎన్ఎంయూ నాయకులు

పుట్టపర్తి టౌన్: డీపీటీఓ మధుసూదన్ నిరంకుశ వైఖరి వీడాలని ఆర్టీసీ ఎన్ఎంయూ నాయకులు డిమాండ్ చేశారు.బుధవారం ఎర్రబ్యాడ్జిలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిపోలో కొంత మంది అధికారులు తోటి ఉద్యోగులపై నోరు పారేసుకుంటూ కించపరుస్తున్నారన్నారు. డిపోల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను డీపీటీఓ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించలేదన్నారు. కార్యక్రమంలో రీజనల్ కార్యదర్శి షబ్బీర్, జోనల్ జాయింట్ సెక్రటరీ శ్రీరామ్‌నాయక్, రీజనల్ ఉపాధ్యక్షులు తిరుపతమ్మ, నాయకులు పాల్గొన్నారు

'ఎన్ఎంయూఏ' నిరసన

ధర్మవరం అర్బన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటూ స్థానిక ఆర్టీసీ డిపోలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఎంయూఏ రీజనల్ నాయకులు నీళ్ల శంకరయ్య, దుర్గాప్రసాద్, డిపో అధ్యక్షుడు ప్రభాకర్, కార్యదర్శి మధుసూదన్ మాట్లాడుతూ వివిధ డిపోలకు ఉద్యోగులను బదిలీ చేయడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. డీపీటీఓ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో డిపో గ్యారేజ్ అధ్యక్షుడు డీఆర్ కుమార్, కార్యదర్శి హరికృష్ణ, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ బదిలీలు ఆపాలి

కదిరి అర్బన్: ఆర్టీసీలో అక్రమ బదిలీలు ఆపాలంటూ బుధవారం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా ప్రజా రవాణా అధికారి ఉద్యోగుల పట్ల వ్యవహరిస్తున్న తీరు సరికాదన్నారు. డిపోలో నెట్‌సమస్యలు, అక్రమ చార్జీషీట్లు, బస్సుల కండీషన్, పెండింగ్ అరియర్స్ తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అశ్వర్థామయ్య, ప్రభాకర్‌రెడ్డి, రామక్రిష్ణ, నారాయణస్వామితో పాటు పలువురు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


సీఐ ఆరోహణరావు

బత్తలపల్లి: శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తానని ధర్మవరం రూరల్ సీఐ పి.ఆరోహణరావు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూస్తామన్నారు. బత్తలపల్లిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. బత్తలపల్లి కూడలి, ఆర్డీటీ ఆసుపత్రి వద్ద నిత్యం సిబ్బంది పర్యవేక్షణలో ట్రాఫిక్ సమస్య లేకుండా చూస్తామన్నారు. అనంతరం ధర్మవరం డీఎస్పీ టి.శ్రీనివాసులును ఆయన కలిశారు. ఎస్‌ఐ టీవీ శ్రీహర్ష, ఏఎస్‌ఐ సోమశేఖర్‌మూర్తి తదితరులు సీఐని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఏఈగా నారాయణమ్మ..



పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి అర్బన్ నూతన విద్యుత్ ఏఈగా నారాయణమ్మ బుధవారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు తీసుకొన్నారు. కొత్త ఏఈకి సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

మున్సిపల్ కమిషనర్‌గా మాధవరెడ్డి..

ప్రశాంతి నిలయం: పుట్టపర్తి కమిషనర్‌గా మాధవరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. బుధవారం కార్యాలయానికి విచ్చేసిన ఆయనకు పాలకమండలి సభ్యులు, సిబ్బంది స్వాగతం పలికారు.

దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి


దిశ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

అమడగూరు: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు సెల్‌ఫోన్‌లలో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఎస్‌ఐ వెంకటనారాయణ పేర్కొన్నారు. బుధవారం ఆయన అమడగూరు బస్టాండులో గ్రామస్తులకు దిశ యాప్‌పై అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ దిశ యాప్ డౌన్‌లోడ్, ఉపయోగించే విధానాలను వివరించారు. సెల్‌ఫోన్‌లో దిశయాప్ ఉంటే భద్రత ఉన్నట్లేనన్నారు. ఇప్పటికే చాలా మంది మహిళలు దిశ యాప్ ద్వారా రక్షణ పొందారని తెలిపారు.

బత్తలపల్లి: దిశ యాప్ మహిళల పాలిట శ్రీరామ రక్షగా నిలుస్తుందని బత్తలపల్లి ఎస్‌ఐ టీవీ శ్రీహర్ష అన్నారు. బుధవారం ఆర్డీటీ ఆసుపత్రిలోని నర్సింగ్ విద్యార్థినుల సెల్‌ఫోన్లలో దిశ యాప్ డౌన్‌లోడ్ చేసే కార్యక్రమాన్ని సచివాలయ మహిళా పోలీసులు, పోలీసులు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని వివరించారు. కిశోరీ బాలికలు, యువతులు, మహిళలకు యాప్ గురించి వివరించాలని సూచించారు. ఆపదలో ఉన్న మహిళలు ఎస్ఓఎస్ బటన్ నొక్కగానే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం వస్తుందని, బాధితులను వెంటనే రక్షించవచ్చన్నారు. సచివాలయ మహిళా పోలీసులు, పోలీసులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు అవగాహన కల్పించండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ, తహసీల్దార్

అమడగూరు: ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను చేపట్టేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని అధికారులు పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీఓ మునెప్ప, తహసీల్దార్ వెంకటరెడ్డి మహమ్మదాబాద్, జేకేపల్లి, తుమ్మల గ్రామ సచివాలయాల పరిధిలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం వారు సచివాలయ, హౌసింగ్ సిబ్బందితో మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 1,556 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. 314 ఇళ్లకు ఇంతవరకూ నిర్మాణాలను చేపట్టలేదన్నారు. వెంటనే పనులు ప్రారంభించకపోతే మంజూరును రద్దు చేస్తారన్నారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణాలను చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ భానుప్రకాష్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న విద్యార్థులు

కదిరి అర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి విద్యార్థులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ నాలుగోసారి జగనన్న విద్యాకానుకలో స్కూల్‌డ్రస్, బుక్స్, షూస్, డిక్షనరీ అందజేస్తున్నారని పేర్కొన్నారు. నాడు నేడు పథకంతో పాఠశాలలను కార్పొరేట్ తరహాలో అభివృద్ధి చేశారని తెలిపారు. విద్యకు పెద్దపీట వేసి తమకు నాణ్యమైన విద్య అందిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు ఆసిఫ్, మనోజ్, శ్రీకాంత్, నరసింహ, నవాజ్, వెంకీ, షఫి, మంజూ,జాహిద్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణ


బత్తల వెంకటరమణకు నియామకం పత్రం అందజేస్తున్న ఆర్. క్రిష్ణయ్య

కదిరి అర్బన్: బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శిగా కదిరికి చెందిన సీనియర్ నాయకులు బత్తల వెంకటరమణను ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. క్రిష్ణయ్య నియమించారు. బుధవారం విజయవాడలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారేష్ ఆధ్వర్యంలో బీసీ కులాల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన బత్తల వెంకటరమణ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడతానని తెలిపారు.

చిత్తశుద్ధితో పనిచేయండి

కదిరి టౌన్: అంగన్‌వాడీ కార్యకర్తలు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని కదిరి అర్బన్ ప్రాజెక్ట్ సీడీపీఓ రాధిక తెలిపారు. మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్ల సెంటర్-2లో బుధవారం జనభాగీరథీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడేళ్ల లోపు పిల్లలను అంగన్‌వాడీకి ఆహ్వానించేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్తలు బాగా పనిచేయకుంటే ప్రభుత్వానికి, అధికారులకు చెడ్డ పేరు వస్తుందనే విషయాన్ని గుర్తించాలన్నారు. ప్రాథమిక దశలో చిన్నారులకు బొమ్మలు, వస్తువులు, అక్షరాలను గుర్తించేలా తీర్చిదిద్దాలన్నారు. మాబున్నీషా, ఇందిరమ్మ, రామలక్ష్మి, సుజాత, తదితరులున్నారు.

పండ్ల తోటల సాగుపై ప్రత్యేక దృష్టి

తాడిమర్రి: పండ్లతోటల సాగుపట్ల ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ విజయలక్ష్మీ ఉపాధిహామీ సిబ్బందికి సూచించారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆమె ఉపాధిహామీ సిబ్బంది, క్షేత్ర సహాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున పండ్ల తోటల పెంపకానికి ఎంపికైన రైతులందరి పొలాల్లో గుంతలు తీయించి మొక్కలను నాటే కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సంజీవరెడ్డి, ఈసీ అశోక్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి: బుక్కపట్నం మండలంలోని శ్రీ సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య పేర్కొన్నారు. ఈ నెల 19 నుంచి 24 వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు, 26 నుంచి 30 వరకూ వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాల కోసం కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడొచ్చు

పుట్టపర్తి: సరైన సమయంలో రక్తదానం చేయడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని ఎన్ఎస్ఎస్ అధికారి చంద్రమోహన్ పేర్కొన్నారు. బుధవారం బుక్కపట్నంలోని శ్రీ సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. చంద్రమోహన్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, క్యాన్సర్ చికిత్సలు, తలసేమియా చికిత్సల సమయంలో రక్తం చాలా అవసరమవుతుందన్నారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

సంక్షిప్త సమాచారం

మానిటర్ వితరణ

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ డిపోకు కండక్టర్ సుబ్బరాయుడు బుధవారం సీసీ కెమెరాల మానిటర్ వితరణ చేశారు. డీఎం మైనోద్దీన్‌కు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజర్ హరిమోహన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

తారురోడ్డు నిర్మాణానికి భూమిపూజ

తనకల్లు: గందోడివారిపల్లి నుంచి జోడుగళ్ల గంగమ్మ ఆలయం మీదుగా కురమోళ్లపల్లి వరకు రూ.2.18 కోట్లతో వేయనున్న తారురోడ్డు నిర్మాణానికి బుధవారం సింగిరివాండ్లపల్లి వద్ద భూమిపూజ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు దొరస్వామి, మాజీ ఎంపీటీసీ ఆదినారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా చెగువేరా జయంతి

ధర్మవరం: పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో చెగువేరా 95వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజా, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పోతలయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు జగదీష్ ఆధ్వర్యంలో చెగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే చేర్పించండి

కొత్తచెరువు: బడిఈడు పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని ప్రధానోపాధ్యాయులు చలపతి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని కొడపగానిపల్లి జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

59 మంది రక్తదానం

తలుపుల: మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా బుధవారం వైద్యాధికారులు మున్వర్‌బాష, సల్మా ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 59 మంది రక్తదానం చేసినట్లు వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ ఐనొద్దీన్, ఎస్‌ఐ మగ్బుల్‌బాష, ఎంపీపీ రఫినాయక్, మాజీ సర్పంచ్ ఫయాజ్ అహమ్మద్ పాల్గొన్నారు.

గ్రీన్ భారత్ కార్యాలయం ప్రారంభం

పుట్టపర్తి టౌన్: సమస్త జీవరాశులకు ప్రాణవాయువు అందించడమే లక్ష్యంగా గ్రీన్ భారత్ పని చేస్తుందని చైర్మన్ శంకరనారాణ పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తి పట్టణంలో గణేష్ సర్కిల్‌లో గ్రీన్ భారత్ కార్యాలయం ప్రారంభించారు. బీజేపీ మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు సమతి సురాణి, పారిశ్రామికవేత్త శ్రీనివాసులు, డీసీసీ ప్రెసిడెంట్ కోటా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారిపై అత్యాచారయత్నం

కదిరి టౌన్: పట్టణంలోని శివారు ప్రాంతంలో 8 సంవత్సరాల చిన్నారిపై బుధవారం ఓ వ్యక్తి అత్యాచారానికి యత్నించాడు. పట్టణానికి చెందిన రామాంజునేయులు చిన్నారికి ఐస్‌క్రీమ్ తీసిస్తానని చెప్పి ఇంట్లోకి తీసుకువెళ్లాడు. అత్యాచారయత్నానికి దిగడంతో చిన్నారి కేకలు వేసింది. దీంతో రామాంజనేయులు పారిపోయాడు. చిన్నారి తల్లిదండ్రులు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఏడుగురిపై అట్రాసిటీ కేసు

ముదిగుబ్బ: భూమి వివాదానికి సంబంధించి ఏడుగురు టీడీపీ నాయకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంతో పాటు హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హేమంత్‌కుమార్ తెలిపారు. ముదిగుబ్బ ఎస్సీ కాలనీకి చెందిన ఆదినారాయణ, నాగేంద్రమ్మల భూమి తాము కొన్నామంటూ టీడీపీ నాయకులు వారిపై దాడి చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తుమ్మల నాయుడు, సోమశేఖర్, వినోద్‌కుమార్, అశోక్, సుధాకర్, లక్ష్మన్న, మహేంద్రపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

ఓడీ చెరువు: అయ్యప్పసన్నిధిలో వెలసిన విద్యా గణపతి ఆలయంలో బుధవారం చిన్నారులకు పురోహితులు పంచరత్న సురేష్ అక్షరాభ్యాసం చేయించారు. ఆలయ నిర్మాణ సంకల్పకులు పచ్చార్ల ఆంజనేయులు నాయుడు ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథిగా తహసీల్దార్ శ్రీధర్ ప్రారంభించారు. దాత కోడూరు శ్రీకాంత్ విద్యార్థులకు పలకలు అందజేశారు.